
సాక్షి
కుమురం భీం

మంగళవారం : 21 : మే : 2024



రైలు పట్టాలపై రక్త చరిత్ర..!

రైలు పట్టాలపై నిండు ప్రాణాలు గాలిలో కలి సిపోతున్నాయి. క్షణికావేశంలో కొందరు ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. మరికొందరు ప్రమాదవశాత్తు మృతి చెందుతున్నారు. 8లో▸



అలసిన దేహానికో 'టీ'

చెమటలు కక్కే వేడిలోనూ కొంతమంది పొగలు కక్కే చాయ్ తాగుతుంటారు. పేద, ధనిక వ్యత్యాసం లేకుండా టీని ఆస్వాదిస్తుంటారు. నేడు అంతర్జాతీయ 'టీ' దినోత్సవం. 9లో▸

గరిష్టం/కనిష్టం

40.6 /29.8

వాతావరణం

చాలావరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే వేడిగా ఉంటుంది. ఉక్కపోత కూడా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం డీఈవో అశోక్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 685 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, ఇతర మరమ్మతులు విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. బాలికలకు ప్రత్యేక మూత్రశాలలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ మరమ్మతులు చేపట్టాలన్నారు. జిల్లాలో విద్యార్థుల యూనిఫాం తయారీ కోసం 78 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో నోడల్ అధికారి భరత్, డీఆర్‌డీవో సురేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలు

ఆసిఫాబాద్‌రూరల్: 2024- 25 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి సజీవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నాన్ రెసిడెన్షియల్‌లో ఒకటో తరగతి విద్యార్థులకు 78 సీట్లు, ఐదో తరగతిలో 40 రెసిడెన్షియల్ సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఒకటో తరగతి విద్యార్థులు 2018 జూన్ 1 నుంచి 2019 మే 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జూన్ 7లోగా స్కూల్ సర్టిఫికెట్, ఆధార్ దరఖాస్తులకు జత చేసి జిల్లా కేంద్రంలో షెడ్యూల్డ్ కులాల కార్యాలయంలో అందించాని సూచించారు.

వేలం ఆదాయం రూ.1.54లక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీకేశవనాథస్వామి ఆలయ భూములకు సోమవారం దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. సంవత్సర కాలానికి కౌలు నిమిత్తం నిర్వహించిన వేలంలో గుండి శివారులోని సర్వే నం.94లో 11ఎకరాల 16 గుంటలకు రూ.1,54,000 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా తెలిపారు. ఆలయ పరిధిలో 6 సర్వే నంబర్లలో భూములు ఉండగా.. కేవలం 94 సర్వే నంబర్‌లోని భూములకు మాత్రమే వేలం జరిగిందని పేర్కొన్నారు. గతేడాది వచ్చిన దాని కంటే అదనంగా రూ.59వేల ఆదాయం వచ్చిందని తెలిపారు. మిగతా ఐదు సర్వే నంబర్ల పరిధిలోని భూములకు వేలం నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి బాపిరెడ్డి, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ మనోజ్‌కుమార్, అర్చకులు నరేష్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

వాంకిడి(ఆసిఫాబాద్): గర్భిణులు వైద్యుల సూచనల మేరకు ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం సందర్శించారు. గర్భిణులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కాన్పులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలోనే డెలివరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎన్‌సీడీ, సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించాలని, అర్హులకు ఆయుష్మాన్ భవ ఐడీలు జనరేట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీవో వినోద్, ఆస్పత్రి వైద్యుడు వినయ్ ఉప్రే, హెచ్ఈ రషీద్, హెచ్ఈవో రవిదాస్, పీహెచ్ఎన్ క్రిష్టియానా తదితరులు పాల్గొన్నారు.

మహా కిక్కుకు డిమాండ్!



కాగజ్‌నగర్ డివిజన్‌లో పోలీసులు పట్టుకున్న దేశీదారు మద్యం(ఫైల్)

- గ్రామాల్లోకి 'దేశీదారు' ప్రవాహం
- రోడ్డు, రైలు మార్గాల్లో జిల్లాకు యథేచ్ఛగా రవాణా
- విచ్చలవిడిగా విక్రయాలు
- కట్టడిపై దృష్టి సారించని అధికార యంత్రాంగం

కౌటాల(సిర్పూర్): జిల్లాలో మహారాష్ట్ర మద్యం ఏరులై పారుతోంది. సరిహద్దు దాటి జోరుగా రవాణా అవుతోంది. స్థానికంగా డిమాండ్ ఉండటంతో పలువురు వ్యాపారులు చౌకగా లభ్యమయ్యే దేశీదారు మద్యంపై దృష్టి సారించారు. సోమవారం కాగజ్‌నగర్‌లో 50 బాటిళ్ల పోలీసులకు పట్టుబడ్డాయి.

తక్కువ ధర.. డిమాండ్ ఎక్కువ

ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో మొత్తం 32 మద్యం దుకాణాలు, మూడు బార్లు ఉన్నాయి. ఏటా సుమారు రూ.250 కోట్ల విక్రయాలు జరుగుతున్నాయని అంచనా. జిల్లాలోని వైన్స్ షాపుల్లో సిండికేట్‌గా మారి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో చాలా మంది మందుబాబులు గుడుంబా, దేశీదారు మద్యం తాగేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో గుడుంబా, దేశీదారు మద్యం విక్రయాలు మళ్లీ జోరందుకున్నాయి. సరిహద్దున ఉన్న పెన్‌గంగ, వార్ధా, ప్రాణహిత నదుల పరిసరాల ప్రాంతాల మీదుగా నిత్యం జిల్లాకు దేశీదారు సరఫరా చేస్తున్నారు. కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి, గుండాయిపేట్, వీర్దండి, తాటిపల్లి, సాండ్‌గాం, వీరవెల్లి, చింతలమానెపల్లి మండలంలోని రణవెల్లి, దిందా, గూడెం, బెజ్జూర్ మండలంలోని సోమిని, తలాయి గ్రామాల సమీపంలోని ప్రాణహిత, వార్ధా నదుల మీదుగా పడవల ద్వారా ఈ దందా సాగుతోంది. మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాలకు వెళ్లి దేశీదారు మద్యం కొనుగోలు చేస్తున్నారు. అలాగే మహారాష్ట్రలోని రాజురా ప్రాంతం నుంచి ప్రైవేట్ వాహనాల్లో వాంకిడి మీదుగా కూడా జిల్లాకు సరఫరా అవుతోంది. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోనే గడిచిన నాలుగు నెలల్లో 11 కేసుల్లో తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. రూ.28 వేల విలువైన 70 లీటర్ల దేశీదారు మద్యం పట్టుకున్నారు.

రైలు మార్గాల్లో రవాణా ఈజీ..

రైలు మార్గంలో అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యాన్ని ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్, ఆబ్కారీ అధికారుల ఆధ్వర్యంలో పట్టుకుంటున్నారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో ప్యాసింజర్ రైలులో రూ.లక్ష విలువైన దేశీదారు మద్యం స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట, బల్లార్షా జంక్షన్ల మధ్య నడిచే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సాధారణ ప్రయాణికుల మాదిరిగా కాగజ్‌నగర్, రెబ్బెన, మంచిర్యాల, పెద్దపెల్లి, జమ్మికుంటకు చెందిన దళారులు రాకపోకలు సాగిస్తున్నారని తెలుస్తుంది. వీరు బల్లార్షాలోని లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నుంచి దేశీదారు మద్యం కొనుగోలు చేసి సీసాలను బ్యాగులు, సంచుల్లో నింపుతున్నారు. రైళ్లలోని మరుగుదొడ్లు, ప్రయాణికులు కూర్చునే సీట్ల కింద దాస్తూ వారు మాత్రం మరో చోట కూర్చుంటారు. ఒకవేళ పోలీసులు తనిఖీలకు వస్తే అక్కడి నుంచి నిశబ్దంగా వారు తప్పించుకుంటున్నారు.

సీన్ రివర్స్

గతంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాలో మద్యాపాన నిషేధం అమల్లో ఉండేది. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సరిహద్దు మండలాల నుంచి తెలంగాణ రాష్ట్రం నుంచి మద్యం ఆయా జిల్లాలకు అక్రమంగా స్మగ్లింగ్ చేసేవారు. 2020లో మహారాష్ట్ర ప్రభుత్వం చంద్రాపూర్ జిల్లాలో మద్యపాన నిషేధం ఎత్తివేసింది. ముఖ్యంగా అక్కడ చీప్ లిక్కర్‌గా వ్యవహరించే దేశీదారు వెరైటీకి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. వివిధ ఫ్లేవర్లతో కూడిన మద్యాన్ని ఇక్కడి ప్రజలు సైతం ఇష్టపడతారు. దీంతో కొందరు వ్యాపారులు దీనిని దందాగా ఎంచుకున్నారు. తెలంగాణ మద్యం అమ్మితే లాభాలు అంతంత మాత్రమేనని, మహారాష్ట్రలోని చౌక మద్యం ద్వారా ఎక్కువ లాభాలు వస్తాయని వారు చెబుతున్నారు. దేశీదారు ఒక్కో పెట్టె ధర రూ.1920 ఉంటుంది. ఇందులో 48 సీసాలు ఉంటాయి. ఒక్కో సీసాకు రూ.40 ఉంటే ఇక్కడ రూ.70కి విక్రయిస్తున్నారు. ఖర్చులు పోగా ఒక్కో పెట్టెపై రూ.1200 వరకు లాభం ఉంటుంది. జిల్లావ్యాప్తంగా దేశీదారు మద్యం అమ్మకాలు బహిరంగంగానే కొనసాగుతాయి. బెల్టు షాపుల్లో 24 గంటలు ఈ మద్యం అందుబాటులో ఉంటుంది. అధికారులు ఆడపాదడపా కేసులు నమోదు చేస్తున్నా.. పూర్తిస్థాయి కట్టడికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

కట్టడికి చర్యలు



మహారాష్ట్ర నుంచి జిల్లాకు వచ్చే వివిధ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాం. పలుచోట్ల చెక్‌పాయింట్లు ఏర్పాటు చేశాం. రైళ్లలోనూ రైల్వేశాఖ సహకారంతో నిత్యం తనిఖీలు చేపడుతున్నాం. దేశీదారు, గుడుంబా కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ రవాణాకు పాల్పడే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తూ ప్రజలకు సైతం అవగాహన కల్పిస్తున్నాం.

– వి.రవి, ఎక్సైజ్ సీఐ, కాగజ్‌నగర్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు పటిష్ట భద్రత



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: డీ కేటగిరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు పటిష్ట భద్రత కల్పిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఎన్నికల పర్యవేక్షకుడు మధుకర్, డీటీ జితేందర్‌తో కలిసి గుర్తింపు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కేంద్రంలోని వేర్‌హౌజ్ నుంచి సోమవారం ఏఎంసీ గోదాములోని సీ అండ్ డీ కేటగిరి స్ట్రాంగ్ రూమ్‌కు డీ కేటగిరి ఈవీఎంలను తరలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఈవీఎంలను భద్రపరిచామని తెలిపారు.

ఈసెట్‌లో రెబ్బెన విద్యార్థికి ఐదో ర్యాంకు



హసీర్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈసెట్ ఫలితాల్లో రెబ్బెన మండల కేంద్రానికి చెందిన ఎంఏ హసీర్ ఉస్మానీ రాష్ట్ర స్థాయి ఐదో ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ డిప్లొమా చదువుతున్న హసీర్ ఈ నెల 6న నిర్వహించిన ఈసెట్‌కు హాజరయ్యాడు. సోమవారం ఫలితాలు విడుదల కాగా వంద మార్కులకు 80 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు కైవసం చేసుకున్నాడు. చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉండే హసీర్ ఈసెట్‌లో సత్తా చాటడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. హసీర్ తండ్రి షాకీర్ తిర్యాణి మండలంలో ఈజీఎస్ ఏపీవోగా పని చేస్తున్నారు. విద్యార్థిని జెడ్పీటీసీ సంతోష్, ఎంపీటీసీ మధునయ్య, మాజీ సర్పంచ్ అహల్యాదేవి, నాయకులు సుదర్శన్‌గౌడ్, రమేశ్, దేవాజీ తదితరులు అభినందించారు.

'సహకార'లో అవినీతి..!

- ఎరువుల విక్రయం ద్వారా వచ్చిన నగదు కాజేసిన సిబ్బంది..
- మిగిలిన స్టాక్ సైతం మాయం..!
- దహెగాం పీఏసీఎస్‌లో రూ.50 లక్షల అక్రమాలు బట్టబయలు
- రికవరీకి ఆదేశించిన ఉన్నతాధికారులు
- చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు



దహెగాంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం

దహెగాం(సిర్పూర్): అన్నదాతకు అండగా ఉండాలనే సదుద్దేశంతో ఏర్పడిన ప్రాథమిక సహకార సంఘాలు అవినీతికి నిలయాలుగా మారుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడం, సకాలంలో దస్త్రాలు తనిఖీ చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో అక్రమాలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. గతేడాదిలో నిర్వహించిన ఆడిట్‌లో బయటపడిన అక్రమాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. పాలకవర్గం అలసత్వంతోనే సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అన్నదాతలకు ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం సహకార సంఘాల ఆధ్వర్యంలో పంపిణీ చేస్తోంది. వీరు నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయిస్తారు. అలా వచ్చిన నగదును ఎప్పటికప్పుడు సహకార బ్యాంకులో జమ చేయాల్సి ఉండగా.. కొంత జమ చేస్తూ మిగతా సొంతానికి వాడుకుంటున్నారు. 44 జీవో రాక ముందు నుంచి పనిచేస్తున్న సిబ్బంది జిల్లా కమిటీ ఆమోదం తెలిపిన తరువాత వేతనాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లా కమిటీ ఆమోదం లేకుండానే వేతనాలు తీసుకోవడం కూడా అవినీతి కిందికే వస్తోంది.

రూ.50 లక్షలు పక్కదారి..?

దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో ఎరువుల విక్రయాల్లో అవినీతి, సిబ్బంది వేతనాల్లో సైతం అక్రమాలకు పాల్పడ్డారని సమాచారం. సుమారుగా రూ.50 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు ఆడిట్‌లో తేలింది. కార్యాలయంలో ఎరువులను విక్రయించడం ద్వారా వచ్చిన నగదును కొంత మేర ఎప్పటికప్పుడు బ్యాంకులో జమ చేస్తూనే మిగతా సొమ్మును కాజేసినట్లు తెలిసింది. సహకార సంఘం కార్యాలయంలో పని చేసే సిబ్బందే కాజేశారని ఆరోపణలు వస్తున్నాయి. గడిచిన రెండు సీజన్లుగా ఈ అవినీతి జరిగిందని తెలుస్తోంది. 2021- 22, 2022- 23 సంవత్సరాలకు కలిసి మొత్తం రూ.50 లక్షల వరకు అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరిగినా పాలకవర్గానికి తెలియకపోవడంపై అనుమానాలకు తావిస్తోంది.

ఎరువులు సైతం మాయం..?

ఏటా ఎరువులు విక్రయించగా మిగిలిన ఎరువులు నిల్వలు అలాగే ఉండిపోతాయి. నిల్వ ఉన్న సుమారు రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షల విలువైన ఎరువులు కూడా గుట్టుచప్పుడు కాకుండా విక్రయించారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కార్యాలయంలో చైర్మన్ సమక్షంలో అవినీతిపై సిబ్బంది లెక్కలు తేల్చారని తెలుస్తోంది. లెక్కలు చేసిన పత్రాలు సైతం కార్యాలయం నుంచి మాయమైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు పాలకవర్గం మౌనంగా ఉండడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు

దహెగాం ప్రాథమిక సహకార సంఘంలో అవినీతి జరిగిన విషయం తమ దృష్టికి వచ్చింది. విచారణ అధికారిని నియమించాం. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. రూ.50 లక్షలు అవినీతి జరిగింది. రికవరీకి ఆదేశించగా రూ.10 లక్షలు చెల్లించారు. వారికి నెల సమయం ఇచ్చాం. కాజేసిన సొమ్ము రికవరీ చేయడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– మోహన్, ఇన్‌చార్జి డీసీవో

ఆడిట్‌లో బట్టబయలు..

ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో ఏటా మార్చిలో ఆడిట్ నిర్వహిస్తారు. ఎరువులు, విత్తనాలు తదితర అంశాలపై లెక్కలు తేలుస్తారు. రెండు సంవత్సరాలుగా ఎరువుల విక్రయాల్లో అవినీతికి పాల్పడుతున్న విషయం 2023 మార్చిలో నిర్వహించిన ఆడిట్‌లో బయటపడింది. అలాగే 44 జీవో రాక ముందు సహకార సంఘంలో పని చేసే అధికారులు, కిందిస్థాయి సిబ్బంది జిల్లా కమిటీ ఆమోదం లేకుండానే వేతనాలు తీసుకున్నట్లు అధికారులు తేల్చారు. మొత్తం రూ.50 లక్షల వరకు అవినీతి జరిగినట్లు వారు గుర్తించారు. సహకార సంఘంలో ఎరువుల విక్రయాలు, సిబ్బంది వేతనాల్లో సైతం భారీ మొత్తంలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో అవినీతికి పాల్పడిన అధికారుల్లో ఆందోళన మొదలైంది. కాజేసిన సొమ్ము రికవరీకి ఇప్పటికే ఆదేశించారు. ఆడిట్ జరిగి సంవత్సరం దాటినా పూర్తిస్థాయిలో రికవరీ చేయకపోవడం, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు సుమారు రూ.10 లక్షల వరకు రికవరీ చేసినట్లు సమాచారం. కాజేసిన సొమ్మును తిరిగి కట్టాలని(రికవరీకి) ఆదేశించినట్లు తెలిసింది. రికవరీతోనే సరిపెడతారా..? లేదా చర్యలు తీసుకుంటారా..? అనేది తేలాల్సి ఉంది.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా దేవభూషణం

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం ట్రస్మా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దేవభూషణం, గౌరవ అధ్యక్షుడిగా పి.కిషన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి చారి, ఉపాధ్యక్షులుగా తిరుపతి, రాజయ్య, రమన్, కోశాధికారిగా రాజేంద్రప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జితేష్ సితాని, స్పోర్ట్స్ పర్సన్‌గా నరేందర్, సలహాదారులుగా రాపర్తి రవీందర్, గోపాల్, మహేశ్వరరావును ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- బ్లాక్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన ఎస్పీ, అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్: జిల్లాలో ప్రమాదాల నివారణకు అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి జిల్లా రవాణాశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. జిల్లాలో బ్లాక్‌స్పాట్ జాబితాలో ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో బ్లాక్‌స్పాట్‌లు గుర్తించాలన్నారు. రోడ్లపైకి పశువులు రాకుండా యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కార్లు, జీపులతోపాటు ఇతర వాహనదారులు విధిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. సంబంధిత అధికారులు రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు, మూలమలుపులు, ప్రమాద ప్రాంతాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణమే వైద్యసహాయం అందించేందుకు 108 అంబులెన్స్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కేజీవీల్స్ రహదారులపై నడపకుండా చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థల్లో వయస్సు పరిమితి దాటిన వారిని డ్రైవర్లుగా పని చేయకుండా చూడాలన్నారు. అనంతరం ఎస్పీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆర్టీసీ బస్సులు, లారీ డ్రైవర్లు, ఇతర వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. జిల్లాలో 2021లో 68, 2022లో 57, 2023లో 70 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఈ ప్రమాదాల్లో సుమారు 450 మంది మృతి చెందినట్లు తెలిపారు. జిల్లాలో 45 బ్లాక్‌స్పాట్లు గుర్తించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమావేశంలో కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి



పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 1200 మంది హాజరు కానున్నారని తెలిపారు. వీరి కోసం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి)లో ఒక్కో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. 11 కేంద్రాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 1,938 మంది, సెకండియర్ విద్యార్థులు 1051 మంది పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

మే 24న పాలిసెట్, జూన్ 9న గ్రూప్- 1

ఈ నెల 24న నిర్వహించే పాలిసెట్ కోసం జిల్లాలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. విద్యార్థులు గంట ముందే సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. అలాగే జూన్ 9న 13 కేంద్రాల్లో గ్రూప్ -1 ప్రిలిమ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేశామని, పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష పేపర్లను సెంటర్లకు తరలిస్తామని స్పష్టం చేశారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రూప్- 1 పరీక్ష నిర్వహణ అధికారులకు ఈ నెల 22న శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై రక్త చరిత్ర..!

- వివిధ కారణాలతో ఏటా వందలాది మరణాలు
- అనుమానాస్పద ఆత్మహత్యలు అనేకం
- గుర్తు తెలియని మృతదేహాల గుర్తింపులో జాప్యం


రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



ఆత్మహత్యలకు నిలయంగా మారిన రైలు పట్టాలు

మంచిర్యాలక్రైం: క్షణికావేశంలో కొందరు... ఆర్థిక ఇబ్బందులతో మరి కొందరు... ఉద్యోగాలు రాలేదని, ప్రేమ విఫలమైందని... సంతానం కలగడంలేదని... కారణాలు ఏవైనా చావే శరణ్యమనుకుని క్షణికావేశంలో నిండు ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. మరికొందరు ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందుతున్నారు. ఇలా ఏడాదికి వందల సంఖ్యలో మృతి చెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఎక్కడో హత్య చేసి రైలుకింద పడేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు. రైలు పట్టాలపై మృతదేహాల తీరును పరిశీలిస్తుంటే ఆత్మహత్యా? హత్యా? అంతుచిక్కని పరిస్థితి నెలకొంటోంది. ఇలా ఎంతోమంది ప్రాణాలు బలి తీసుకున్న రైలు పట్టాలు రక్త చరిత్రను రాస్తున్నాయి. రైల్వే పోలీసుల పర్యవేక్షణ లేక పోవడంతోనే రైలూ పట్టాలపై నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మృతుల్లో ఎక్కువ శాతం 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సువారే అధికంగా ఉంటున్నారు.

రైలు కిందపడి మృతి చెందిన వారి వివరాలు

సంవత్సరం	ఆత్మహత్యలు	సాధారణ మరణాలు	ప్రమాదవశాత్తు	గుర్తు తెలియనివి
2022	75	08	43	14
2023	73	17	67	19
2024	25	07	18	11

మృతదేహాలపై అనుమానాలెన్నో..
మంచిర్యాల జిల్లా జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 నుంచి 2024 ఏప్రిల్ వరకు 377 మంది వివిధ కారణాలతో రైలు పట్టాలపై మృతి చెందారు. ఇందులో 44 మృతదేహాలు గుర్తుతెలియని వ్యక్తులవే కావడం గమనార్హం. ఎవరో.. ఎక్కడివారో.. ఎందుకు చనిపోయారో.. తెలియక పోవడంతో చేసేదేంలేక మూడురోజుల పాటు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో మృతదేహాన్ని భద్రపరుస్తున్నారు. ఎవరూ రాకపోవడంతో అనాథ శవాలుగా గుర్తించి జీఆర్‌పీ పోలీసులు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నెలల తరబడి మృతుల ఆచూకీ లభించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దూరప్రాంతాల వ్యక్తులెవరైనా నిజంగానే ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేక ఎవరైనా ఇతర ప్రాంతాల్లో హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని రైలు పట్టాలపై పడేసి వెళ్లి పోతున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇలాంటి కేసులు విచారణ పేరట ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిస్టరీగానే మిగిలిపోతున్నాయి.

ఆత్మహత్యలు చేసుకునే ప్రాంతాలు...
మంచిర్యాల జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ పరిధిలో కాగజ్‌నగర్ నుంచి మొదలుకుని తాండూర్, రేచిని, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య అధికంగా రైలు పట్టాలపై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ప్రాంతాల్లోని రైలు పట్టాలు ప్రజలు సంచరించే ప్రాంతాలకు సమీపంగా ఉండడమే దీనికి ప్రధాన కారణమని అధికారులు భావిస్తున్నారు.

మచ్చుకు కొన్ని సంఘటనలు....
- 2023 ఆగస్టులో మంచిర్యాల శివారులోని గోదావరి సమీపంలో ఓ గుర్తుతెలియని మహిళ (25) దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకూ సదరు మహిళ ఆచూకీ లభించలేదు.
- 2023 జూలై 10న జైపూర్ మండలానికి చెందిన ఓ యువకుడు పెళ్లి కావడంలేదని మనస్తాపం చెంది మంచిర్యాల ఏసీసీ వెనుకాల గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.
- 2021 జనవరిలో మంచిర్యాల శివారులో ఒక వృద్ధుడు, యువకుడు రైలు కిందపడి మృతి చెందారు. వృద్ధుడు స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన దాసరి బాపుగా గుర్తించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లారు. యువకుడు ఎవరనేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది.

ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నారు



చాల మంది క్షణికావేశానికి గురై ఆత్మహత్యలే శరణ్యంగా భావించి బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారు. ఇందులో ఎక్కువ శాతం 20 నుంచి 40 సంవత్సరాల వారే అధికంగా ఉంటున్నారు. ఎక్కడో ఉంటున్నారు. రైలు రాగానే ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నారు. మద్యం సేవించి మత్తులో రైలు పట్టాలపై పడుకుంటున్నారు. దీంతో శరీరాలు గుర్తు పట్టలేని విధంగా నుజ్జునుజ్జవుతున్నాయి. వాటిని తొలగించాలన్నా తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. కానీ ఉద్యోగరీత్యా తప్పదు. గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించి పత్రిక ప్రకటన ఇస్తున్నాం. మూడు రోజుల పాటు చూసి అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం.
– సుధాకర్, జీఆర్‌పీ ఎస్సై, మంచిర్యాల

క్లుప్తంగా

గాయపడిన మహిళా కూలీ మృతి


మల్లవ్వ (ఫైల్)

దండేపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 17న ఉపాధి హామీ కూలీల ను తీసుకొస్తున్న టాటా ఏస్ ట్రాలీ ప్రమాదవశాత్తు కాల్వలో బోల్తా పడిన ఘటనలో దండేపల్లికి చెందిన బంగారు మల్లవ్వ (46)కు తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. భర్త నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

లింగాపూర్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిమానాయక్ తండాకు చెందిన జాదవ్ యాదగిరి (39) సోమవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని పశువుల కొట్టంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య వనిత, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

ఆసిఫాబాద్‌అర్బన్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని ఆళ్లపల్లికి చెందిన ముద్రకల్ శ్రీనివాస్ (32) ఐదేళ్లుగా జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో నివాసం ఉంటూ మేస్త్రీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య, పిల్లలతో గొడవపడ్డాడు. వారిని ఇంటిబయటే ఉంచి తలుపులు వేసుకున్నాడు. ఎంతకూ తీయకపోవడంతో బయటే పడుకున్నారు. ఉదయం లేచిన తర్వాత కూడా తలుపులు తీయకపోవడంతో వెంటిలేటర్ నుంచి లోనికిచూడగా ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య సమ్మక్క, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

షూరిటీ పెట్టిన పాపానికి ప్రాణం పాయే...


ఖదీర్(ఫైల్)

మంచిర్యాలక్రైం: తెలిసిన వ్యక్తికి మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పించిన పాపానికి ప్రాణం తీసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని మజీద్‌వాడలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మజీద్‌వాడకు చెందిన మహ్మద్ ఖదీర్ (52) ఆటో ట్రాలీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకు తెలిసిన ఓ మిత్రుడికి అత్యవసరంగా డబ్బులు అవసరం ఉండడంతో ఓ ఫైనాన్సియర్ వద్ద మధ్యవర్తిగా ఉండి అప్పు ఇప్పించాడు. అతను తిరిగి చెల్లించకపోవడంతో సదరు ఫైనాన్స్ వ్యాపారి ఒత్తిడి చేయడం మొదలుపెట్టాడు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు మాథిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాలధారణకు వెళ్తూ మరలిరాని లోకాలకు..

- గోదావరిలో మునిగి విద్యార్థి మృతి


కీర్తన్‌గౌడ్ మృతదేహం

దండేపల్లి: హనుమాన్ మాలధారణ కోసం వెళ్తూ గోదావరి నదిలో స్నానం చేస్తూ విద్యార్థి నీటమునిగి మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వద్ద చోటు చేసుకుంది. ఎస్సై భూమేష్ తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి దుర్గం కీర్తన్‌గౌడ్ అలియాస్ రిషి (19) హనుమాన్ మాలాధారణ కోసం స్నేహితులతో కలిసి సోమవారం దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయానికి బయల్దేరాడు. గూడెం గోదావరి వంతెన సమీపంలో స్నానం చేసేందుకు నదిలో దిగారు. కీర్తన్‌కు ఈత రాకపోవడంతో స్నేహితుల కళ్లముందే నీటిలో మునిగి చనిపోయాడు. పోలీసులకు సమాచారం అందించడంతో గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపలా ఉండి ప్రాణాలు కాపాడారు..

- తెగిపడిన విద్యుత్ తీగలు
- సకాలంలో స్పందించని సబ్‌స్టేషన్ ఆపరేటర్


తెగిపడిన విద్యుత్ వైర్ల వద్ద కాపలా ఉన్న గ్రామస్తులు

వేమనపల్లి: తెల్లవారుతోంది.. చిమ్మచీకటి తొలగనేలేదు.. మండల కేంద్రంలో తునికాకు సేకరణ కోసం వెళ్లే ప్రజలు పరుగులు తీస్తున్నారు.. రైతులు వరి కళ్లాల వైపు.. పశువులు మేత కోసం పొలాల వైపు వెళ్తున్నాయి. అంతలోనే ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మంటలు లేస్తుండటంతో రోడ్డుపై వెళ్తున్న ఏమ కిష్టయ్య, కంపెల సత్యం, మధునయ్య గమనించారు. గతంలో ఇదే ప్రదేశంలో విద్యుత్ తీగలు తెగిపడి గొండే రాజన్న, గేదె అక్కడికక్కడే మృతి చెందారు. అదే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డుపై నిలబడి ప్రజలను అప్రమత్తం చేశారు. పశువులను దారిమళ్లించారు. విద్యుత్ సరఫరా నిలిపివేయాలని నీల్వాయి సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో జేఎల్ఎం ఉదయ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్‌లకు ఫోన్ చేసి ప్రమాద పరిస్థితిని వివరించారు. వారి జోక్యంతో సరఫరా నిలిపివేయగా పెను ప్రమాదం తప్పింది.

కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి


పత్రాలు అందజేస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏఐటీయూసీకి కార్మికులు ఎంతో నమ్మకంతో గుర్తింపు హోదా కల్పించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిత్యం అందుబాటులో ఉంటూ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడ ఓసీపీలో ఏఐటీయూసీ నూతన పిట్ కమిటీని యాజమాన్యానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తికి ఇచ్చే ప్రాధాన్యత కార్మిక శ్రేయస్సుకు కూడ ఇవ్వాలని అన్నారు. యాజమాన్యం నిర్దేశించిన లక్ష్య సాధనకు ఏఐటీయూసీ పూర్తి స్థాయిలో సహకరిస్తుందని, అదే తరహాలో కార్మిక సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, రాజేశ్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

'కిరీటి కుటుంబాన్ని పరామర్శించాలి'


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్: అధికారుల వేధింపులకు బలైన యువ ఇంజినీర్ కిరీటి కుటుంబాన్ని సీఎండీ పరామర్శించాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం పవర్ ప్లాంటు వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎస్టీపీపీలో అధికారి మరణిస్తే సీఎంవోఏ సంఘం ఇప్పటి వరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే అవుట్ సోర్సింగ్ అధికారులను తొలగించి కంపెనీ అధికారులనే ఈడీగా నియమించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఇప్పటికే పలుమార్లు సమ్మె నోటీసులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గాడిపెల్లి కృష్ణప్రసాద్, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయికృష్ణరెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



చంద్రశేఖర్ (ఫైల్)

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన గుర్లె చంద్రశేఖర్ (28) సోమవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో మద్యం మత్తులో నలుగురు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో చంద్రశేఖర్‌ను మిగతా యువకులు బండ రాయితో మోదడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకార్ పరిశీలించి హత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


బెల్లంపల్లి: బెల్లంపల్లి–మందమర్రి రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు పట్టాలపై సోమవారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. మృతునికి 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, ఏదో గుర్తు తెలియని రైలులో నుంచి కిందపడిపోయి మృతిచెంది ఉంటాడన్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నల్లని సన్నగీతలు కలిగిన తెల్లరంగు ఫుల్ షర్ట్, నల్లరంగు కాటన్ జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712658596 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యాపారి మృతి


శ్రీనివాస్(ఫైల్)

భీమారం: ఈ నెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండల కేంద్రంలోని బీసీకాలనీకి చెందిన వ్యాపారి కొమ్ము శ్రీనివాస్ (48) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో కొన్నేళ్ల నుంచి కిరాణ షాపు నిర్వహిస్తున్న శ్రీనివాస్ వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపం చెందాడు. ఈనెల 18న ఇంటినుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతునికి భార్య విజయలక్ష్మి, కుమారుడు అభిరామ్ ఉన్నారు.

తునికాకు కూలీకి గాయాలు


చికిత్స పొందుతున్న మదునక్క

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం చారిగాం గ్రామానికి చెందిన మదునక్క సోమవారం కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో తునికాకు సేకరణకు వెళ్లింది. చెట్టెక్కి తునికాకు తెంపుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

వైద్య ఖర్చులు ఇవ్వాలి
గాయపడిన కూలీకి అటవీశాఖ అధికారులు వైద్య ఖర్చులు చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బాధితురాలిని ఆయన పరామర్శించారు.

గడ్డివాము దగ్ధం


కాలుతున్న గడ్డివాము

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని బో యవాడ సమీపంలో నారాయణకు చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గడ్డి వాము విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించిఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

తిమ్మాపూర్‌లో శిక్షణ ప్రతినిధుల పర్యటన


వివిధ శాఖల సిబ్బందితో శిక్షణ ప్రతినిధులు

జన్నారం: స్టాఫ్ సెలక్షన్ ద్వారా నియామకమైన వివిధ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు సోమవారం శిక్షణలో భాగంగా జన్నారం మండలం తిమ్మాపూర్‌లో పర్యటించారు. మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ వారికి స్వాగతం పలికారు. ఎంపీవో రమేశ్, ఈజీఎస్, వెటర్నరీ, రేవెన్యూ, వ్యవసాయ శాఖలకు చెందిన సిబ్బంది వారికి సౌకర్యాలు కల్పించారు. శిక్షణలో భాగంగా ఈనెల 25 వరకు అదే గ్రామంలో ఉంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన మౌలిక వసతులను పరిశీలించడం, వ్యవసాయం గురించి రైతులతో మాట్లాడటం , మహిళా సంఘాలతో మాట్లాడటం జరుగుతుందని ప్రతినిధులు సురేందర్ స్వరూప్, బిగ్నరాజ్ మిస్రా, నిఖిల్ జూస్, విశాల్ దకాడ్, శివమ్ తెలిపారు.

నీలగిరి తోటలో మంటలు


రామకృష్ణాపూర్ పట్టణం సూపర్‌బజార్ ఏరియాలోని గురుకుల పాఠశాల ఆవరణలో గల నీలగిరి తోటలో సోమవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలు పెద్దఎత్తున వ్యాపించడంతో గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. – రామకృష్ణాపూర్

'ఎస్డీఎల్ యంత్రాలకు నాసిరకం ఆయిల్'


కార్మికులతో మాట్లాడుతున్న బాజీసైదా

శ్రీరాంపూర్: ఎస్‌డీఎల్ యంత్రాలకు నాసిరకం ఆయిల్ సరఫరా అవుతోందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీ సైదా ఆరోపించారు. సోమవారం ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్‌ని కలిసి సమస్యలు విన్నవించారు. ఎస్‌డీఎల్ యంత్రాలలో నాసిరకం ఆయిల్ వాడడం వలన యంత్రాలు చెడిపోవడం కాకుండా వాటితో పని చేసేటప్పుడు ఆపరేటర్లు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పేర్ పార్ట్స్ కూడా సరిగా ఉండడం లేదన్నారు. కాలం చెల్లిన యంత్రాలను వినియోగం నుంచి తీసివేయాలన్నారు. అంతేకాకుండా డ్రిల్ రాడ్స్, డ్రిల్ బిట్స్ కొరత తీవ్రంగా ఉందని వీటిని డిమాండ్‌కు సరిపడా తెప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, పిట్ సెక్రటరీ ఆకుల లక్ష్మణ్, నాయకులు రమేశ్, సంపత్, రాజమౌళి, రాజయ్య, తిరుపతిరెడ్డి, రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో వాటా ఇవ్వాలని ఆందోళన


చెరువు వద్ద ఆందోళన చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

చెన్నూర్: చెన్నూర్ పెద్ద చెరువులో వాట ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ముదిరాజ్ కులస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏళ్లుగా పెద్ద చెరువులో గంగపుత్రులు, ముదిరాజ్ కులస్తులకు సమాన వాటా ఉన్నట్లు 1998లో పెద్ద మనుషుల మధ్య ఒప్పందం కుదరిందన్నారు. లిఖిత పూర్వకంగా ఇరు కులాలకు చెందిన పెద్ద మనుషులు కాగితాలు రాసుకున్నారన్నారు. కొంత కాలం క్రితం కొందరు గంగపుత్రులు ముదిరాజ్ కులస్తులకు తెలియకుండా బోగస్ సభ్యుల పేర్లతో అధికారులకు లంచాలు ఇచ్చి అక్రమంగా సొసైటీ చేసుకున్నారని ఆరోపించారు. సొసైటీ పేరుతో ఇతర జిల్లాల నుంచి చేపలు పట్టే వారిని తీసుకొని వచ్చి చేపలు పట్టి అమ్ముకుంటున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సొసైటీలో ఉన్న సభ్యులు వివరాలు సేకరించి బోగస్ సభ్యుల పేర్లను తొలగించాలన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గిరెల్లి మల్లయ్య, సాధనబోయిన కృష్ణ, తుమ్మ రమేశ్, జోడు శంకర్, పిట్టల రవి, నెన్నల భీమయ్య, తుమ్మ రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం కల్పించాలి


కారుచీకట్లలో రైల్వే ఓవర్ బ్రిడ్జి

మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్ కాలనీ వద్ద నూతనంగా రైల్వే ట్రాక్‌పై ఏర్పాటు చేసిన ఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం కల్పించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాత్రి సమయాల్లో వెళ్తురు లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అంతే కాకుండా సరదాగా సమీపంలోని పార్కుకు వెళ్లి ఇంటికి నడుచుకుంటూ వెళ్లే వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటుందన్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా, ప్రజలకు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు వెంటనే ఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.